
సాక్షి
కుమురం భీం

సోమవారం, 10, ఏప్రిల్, 2023




సైన్స్ ఒలింపియాడ్ స్కూళ్లు
ఐటీడీఏ ఆధీనంలో సైన్స్ ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఒక్కో తరగతికి 40 మందిని ఎంపిక చేయనున్నారు. 8లో▸



నమాజ్ చేద్దాం రండి..!
ఇస్లాం సంప్రదాయంలో అత్యంత ముఖ్య భూమికను అజాన్ పోషిస్తోంది. అజాన్ అంటే నమాజ్ చేద్దాం రండి.. అని పిలవడం. అజాన్ చరిత్రపై ప్రత్యేక కథనం.. 8లో▸

గరిష్టం/కనిష్టం
38.4 /26.5

వాతావరణం
ఆకాశంలో అక్కడక్కడా మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వేడి, ఉక్కపోత పెరుగుతాయి. సాయంత్రం అక్కడక్కడా చినుకులుపడే అవకాశం ఉంది.



న్యూస్‌రీల్

11న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో ఈనెల 11న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట్నాక విజయ్, కార్యదర్శి శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 నుంచి 20 ఏళ్ల ఉన్న బాలబాలికలు ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఈ నెల 15, 16 తేదీల్లో హనుమకొండలోని జవహర్‌లాల్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. క్రీడాకారులు 11న ఉదయం 8 గంటలకు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు విద్యాసాగర్ మొబైల్ నంబర్ 80080 90626ను సంప్రదించాలని ఆయన కోరారు.

'నిరుద్యోగులకు అండగా వైఎస్సార్‌టీపీ'

నార్నూర్: సీఆర్ బిస్వాల్ కమిటీ ప్రకారం వెంటనే 1.91లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు రిలీజ్ చేయాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం గాదిగూడ మండల కేంద్రంలోని కుమురంభీం చౌక్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని, పేపర్లు లీక్ కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. లీకేజీ వ్యవహారాన్ని సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. పరీక్షలు తిరిగి నిర్వహించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నెలకు రూ.3,016 నిరుద్యోగ భృతి చెల్లించాలని, స్వయం ఉపాధి కల్పించాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా అర్హులకు రుణాలు అందజేయాలన్నారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని, హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు రాంజీ గోండు



నివాళులర్పిస్తున్న నాయకులు

తిర్యాణి(ఆసిఫాబాద్): దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం సాగించిన మహనీయుడు రాంజీ గోండు అని ఆదివాసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట్నాక ప్రవీణ్ అన్నారు. రాంజీ గోండు వర్ధంతి సందర్భంగా ఆదివారం తిర్యాణి మండల కేంద్రంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ రాంజీగోండు ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత రాంజీగోండును ఆదర్శంగా తీసుకుని ఆదివాసీల హక్కుల సాధనకు పోరాటం చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, ఎస్సై రమేశ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు మడావి గుణవంత్‌రావు, సర్పంచులు సింధూజ, ఆత్రం రుక్మిణి, గోపాల్, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు వెడ్మ భగవంత్‌రావు, నాయకులు గెడం సుభాష్, భాస్కర్, అశోక్, ధర్మూ తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగుల అ'పూర్వ' సమ్మేళనం



గోలేటి 1, 1ఏ గనిలో పనిచేసిన ఉద్యోగులు, అధికారులు జీఎం సంజీవరెడ్డి అధ్యక్షతన ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఒక్కచోట కలుసుకుని ఆనందంగా గడిపారు.

- వివరాలు 10లో▸

విద్యాసంస్థల్లో ఫీజులుం!



చింతలమానెపల్లి మండలంలోని రవీంద్రనగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఇద్దరు ఒకటో తరగతి విద్యార్థులను ఫీజులు చెల్లించడం లేదనే కారణంతో పాఠశాల యాజమాన్యం పలుమార్లు దండించింది. ఒకసారి చెవిపై తీవ్రంగా కొట్టడంతో విద్యార్థిని అస్వస్థతకు గురికాగా సదరు విద్యార్థి తల్లిదండ్రులు యాజమాన్యాన్ని నిలదీశారు. అయినా తీరు మార్చుకోని యాజమాన్యం మరో విద్యార్థిని కర్రతో చితకబాదడంతో కాలిపై గాయాలయ్యాయి. ఈ ఘటనలో జిల్లా బాలల సంరక్షణ అధికారులు స్పందించి పాఠశాల యాజమాన్యాన్ని తీవ్రంగా మందలించారు.

కౌటాల మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో ఇదే నెలలో ఫీజులు చెల్లించడం లేదనే కారణంతో పలువురు విద్యార్థులను ఎండలో నిలుచోబెట్టారు. సుమారు రెండు గంటల పాటు ఎండలో నిలుచున్న కారణంగా ఓ విద్యార్థి అస్వస్థతకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని యాజమాన్యాన్ని నిలదీశారు. విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. పై రెండు ఘటనలు ప్రైవేటు పాఠశాలల్లో యాజమాన్యాలు విద్యార్థులపై అమానుష ప్రవర్తనకు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి.

- ప్రైవేటు పాఠశాలల్లో అమానుషం
- విద్యార్థులపై యాజమాన్యాల ప్రతాపం
- చర్యలు తీసుకోని విద్యాశాఖ అధికారులు

చింతలమానెపల్లి(సిర్పూర్): విద్యాబోధన చేయాల్సిన పాఠశాలలు విద్యార్థులకు శిక్షణాలయాలుగా మారుతున్నాయి. ప్రైవేటు పాఠశాలల ధనార్జన లక్ష్యాలకు విద్యార్థులు వేధింపులకు గురవుతున్నారు. విద్య అనేది సేవగా ప్రభుత్వం గుర్తిస్తుండగా ప్రైవేటు పాఠశాలలు ఆదాయార్జనకు మార్గంగా ఎంచుకుంటున్నాయి. జిల్లాలో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మినహా అన్నిమండలాలు గ్రామీణ మండలాలే.. ప్రైవేటు పాఠశాలల్లోని వసతులపై గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారం చేసి ప్రవేశాలు పెంచుకుంటున్నాయి. ఉన్నత స్థాయి బోధన, వసతులు ఉన్నాయని ప్రచారం చేసే యాజమాన్యాల ప్రకటనలకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆకర్షితులవుతున్నారు. అడ్మిషన్ల కోసం ప్రైవేటు సిబ్బందిని నియమించుకుని స్థానిక ఏజెంట్ల సహకారంతో కమీషన్ల ప్రాతిపదికన ప్రణాళికలను అమలు చేస్తున్నారు. ఫీజుల విషయంపై అస్పష్టమైన హామీలను ఇచ్చి అడ్మిషన్లు పెంచుకుంటున్నాయి.

వేధిస్తే కఠిన చర్యలు

చిన్నారులను వేధిస్తే బాలల సంరక్షణ, బాలల హక్కుల చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పాఠశాలలు, విద్యాసంస్థల్లో చిన్నారులపై వేధింపులను బాలల సంరక్షణ అధికారులు పరిశీలించి అనుగుణంగా చర్యలు తీసుకుంటారు. విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం సెక్షన్ 17(1), సెక్షన్ 17(2) ప్రకారం పాఠశాలల్లో శారీరక, మానసికంగా వేధించడం, హింసించడంపై నిషేధం విధించారు. బాలల న్యాయ చట్టం సెక్షన్ 82 ప్రకారం చిన్నారులపై శారీరక దండన అనేది నేరపూరితమని పేర్కొన్నారు. శారీరక దండనకు గురిచేస్తే మొదటి నేరారోపణపై రూ.10వేల జరిమానా విధిస్తారు. మళ్లీ అదే నేరం చేస్తే మూడు నెలల వరకు జైలు శిక్ష, జరిమానా విధించేందుకు ఆస్కారం ఉంది. అలాగే 82(1) ప్రకారం సంస్థలో చేస్తున్న వ్యక్తి వేధింపులకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. 82(3) సెక్షన్1 ప్రకారం యాజమాన్యం విచారణకు సహకరించపోతే రాష్ట్ర ప్రభుత్వం ఆ సంస్థ నిర్వహణ బాధ్యత వహించే వ్యక్తికి మూడేళ్లకు తక్కువ కాకుండా జైలుశిక్ష రూ.లక్ష జరిమానా విధిస్తారు. విద్యాహక్కు చట్టం బాలల న్యాయ సంరక్షణ చట్టం ప్రకారం క్రిమినల్ చర్యలకు వారు బాధ్యులవుతారు.

ఫీజుల కోసం వేధింపులు

ఆరంభంలో ఫీజుల విషయమై ఒత్తిడి చేయని యాజమాన్యాలు అనంతరం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఫీజుల విధానంపై అవగాహన లేకపోవడంతో పాఠశాల యాజమాన్యాల ఆగడాలతో విద్యార్థుల తల్లిదండ్రులు ఏమీ చేయలేని పరిస్థితికి చేరుకుంటున్నారు. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల ప్రజల అవగాహన లేమిని అనుకూలంగా మార్చుకుంటున్నాయి. ఈ క్రమంలో నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు చెల్లించలేకపోవడంతో పాఠశాల యాజమాన్యాలు తమ ప్రతాపాన్ని విద్యార్థులపై చూపిస్తున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫీజులు వసూలు చేయాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నాయి. సదరు ఉపాధ్యాయులు ఫీజులు వసూలు కాని విద్యార్థులను వేధిస్తున్నారు. తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా ఆర్థికపరమైన విషయాల్లో అవగాహన లేని చిన్నారులను ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫీజులు చెల్లించని విద్యార్థులను ఎండలో నిలబెట్టడం, కొట్టడం లాంటి చర్యలకు పాల్పడుతున్నారు. విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

చట్టప్రకారం చర్యలు



చిన్నారులను ఫీజుల కోసం వేధిస్తే ప్రభుత్వ చట్టాల ప్రకారం ఏ విద్యాసంస్థ అయినా చర్యలు తీసుకుంటాం. బాలల న్యాయ సంరక్షణ చట్టాల ప్రకారం ప్రతీ పాఠశాల యాజమాన్యం నడుచుకోవాలి. జరుగుతున్న ఘటనల నేపథ్యంలో ఆయా విద్యాసంస్థలపై దృష్టి సారిస్తున్నాం. ఇలాంటి ఘటనలు జరిగితే జిల్లా బాలల సంరక్షణ శాఖకు సమాచారం ఇవ్వాలి.

– బూర్ల మహేశ్, జిల్లా బాలల సంరక్షణ అధికారి

ప్రజలే బీఆర్‌ఎస్‌కు బలం



మాట్లాడుతున్న ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, పక్కన ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, రామన్న, కుమురంభీం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, తదితరులు

నార్నూర్: ప్రజలు, పార్టీ కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలమని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రైవేట్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా 500 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. కుమురంభీం, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ గెలుపునకు కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గానికి మూడువేల డబుల్ బెడ్రూం ఇళ్లు అదనంగా ఇవ్వాలని సీఎంను కోరుతామని చెప్పారు. ఏజెన్సీ ప్రాంత దళితుల సమస్యలు తెలిపి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ దళితబంధు యూనిట్లు పెంచేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కుమురంభీం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, మాజీ ఎంపీ గోడం నగేశ్, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, ఎంపీపీ కనక మోతుబాయి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు బానోత్ గజానంద్‌నాయక్, ఉర్వేత రూప్‌దేవ్, తొడసం నాగోరావు, అడే సురేశ్, యునుస్ ఆక్బాని, ఇంతియాజ్‌లాలా, కొర్రెళ్ల మహేందర్, కాంతారావు దుర్గే, దేవికాబాయి, మీరాబాయి, విద్యారాణి, హన్మంతరావు, సయ్యద్ ఖాశీం, రాథోడ్ రమేశ్, ఫిరోజ్‌ఖాన్, ప్రభాకర్ తదితరులున్నారు.

జైల్లో ఉన్నవారిని విడుదల చేయాలి

- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్



మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఓబీలో పనిచేస్తున్న డ్రైవర్లకు వేతనాలు పెంచాలని, భూనిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని చేపట్టిన నిరసనలో పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆత్మారాం నాయక్‌తోపాటు 35 మంది భూనిర్వాసిత మహిళలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. గోలేటిలోని బీఎంఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో భూములు కోల్పోయి పీడీఎఫ్, భూనిర్వాసితులకు కాకుండా జీఆర్ఎస్ ఓబీ కాంట్రాక్టు సంస్థలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా ఇతర రాష్ట్రాల వారికి, బీఆర్‌ఎస్ నాయకులు సూచించిన వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఓబీ డ్రైవర్లకు జీతాలను పెంచాలని, భూని ర్వాసిత యువతకు ఉద్యోగాలు కల్పించాలని బాధితులతో కలిసి పోరాడుతున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆత్మారాంనాయక్‌తోపాటు 35 మంది మహిళలపై పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేశారన్నారు. అక్రమంగా కేసు బనాయించి జైళ్లకు తరలించడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. మహిళలు, చంటిపిల్లల తల్లులు అని కూడా చూడకుండా అత్యంత కర్కశంగా వ్యవహరించి జైలుకు తరలించడంతో చిన్నపిల్లలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సింగరేణిలో వంద శాతం ఉద్యోగాలు స్థానికులకు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి, జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, బెల్లంపల్లి ప్రభారీ అన్నపూర్ణ సుదర్శన్‌గౌడ్, కైరిగూడ సర్పంచ్ సంధ్యారాణి, మండల అధ్యక్షుడు గోలెం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

12న రౌండ్ టేబుల్ సమావేశం

ఆసిఫాబాద్‌అర్బన్: ఐకేపీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో రౌండ్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారికి కనీస వేతనంగా రూ.26వేలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఇతర డిమాండ్లు నెరవేర్చాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె ప్రారంభమవుతుందని తెలిపారు. సమ్మె సమయంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, సందేశాలపై సూచనలివ్వాలని కోరారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఆసిఫాబాద్‌అర్బన్: విశ్రాంత ఉద్యోగులు, పెన్షన్‌దారుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కర్ణాగౌడ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర యూనిట్, పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి ఆదేశాల మేరకు నేడు కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని విశ్రాంత ఉద్యోగులు, పెన్షన్‌దారులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం కార్యదర్శి సదానందం, గుర్రాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్
- పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



విందులో పాల్గొన్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా ప్రజలు పండుగలను సోదరభావంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మైనార్టీ వర్గానికి చెందిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రజలు ప్రశాంతంగా పండుగలు నిర్వహించుకునేలా ప్రభుత్వం తరుపున అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పండుగలు మత సామరస్యానికి ప్రతీకలని, చిన్నాపెద్ద సంతోషంగా గడపాలన్నారు. ఈ సందర్భంగా 'మతాలన్నీ మాసిపోవును.. జ్ఞానం ఒక్కటే నిలిచిపోవు' అని ప్రముఖ కవి గురజాడ చెప్పిన మాటలను గుర్తు చేశారు. రంజాన్ మాసంలో నిర్వహించే నియమనిష్టలను నిరంతరం కొనసాగించాలన్నారు. సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని కోరారు. అనంతరం ఎస్పీని పోలీసు అధికారులు శాలువతో సన్మానించారు. అదనపు ఎస్పీలు అచ్చేశ్వర్‌రావు, భీంరావు, డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ మండలం బూర్గుడ ప్రభుత్వ పాఠశాలలో 1994– 95 విద్యాసంవత్సరంలో ఏడో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలోని తాటియా గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకుని ఉత్సాహంగా గడిపారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. గురువు సత్యనారాయణస్వామిని శాలువతో సత్కరించారు. సతీశ్, రాజన్న, కోటేశ్వర్‌రావు, రమేశ్, తిరుపతి, నారాయణ, కృష్ణమూర్తి, వెంకటేశ్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలతోనే సరి!

- ప్రాణహిత, పెద్దవాగు వరదలతో ఏటా పంట నష్టం
- పరిహారం కోసం బాధిత రైతులకు తప్పని ఎదురుచూపులు
- సర్వేలకే పరిమితమవుతున్న అధికారులు
- ఆర్థిక నష్టాలతో కుదేలవుతున్న అన్నదాతలు



బెజ్జూర్ మండలం తలాయిలో ముంపునకు గురైన పంట చేను వద్ద రైతు(ఫైల్)

బెజ్జూర్(సిర్పూర్): ఏళ్లుగా 'ముంపు' రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. భారీ వర్షాలతో ప్రాణహిత, పెద్దవాగు ఉప్పొంగి వరదలతో పంట చేలను ముంచెత్తుతున్నాయి. మూడేళ్లుగా వరుసగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అయితే పంట నష్టంపై వ్యవసాయశాఖ అధికారులు సర్వేలు నిర్వహిస్తున్నా బాధితులకు పరిహారం మాత్రం అందని ద్రాక్షగా మారింది. గతేడాది పెద్దవాగు, ప్రాణహిత పరీవాహక ప్రాంతాల్లో పత్తి చేలు ముంపునకు గురయ్యాయి. సర్వే నిర్వహించి నష్టం అంచనా వేసినప్పటికీ బాధిత రైతులకు ఇప్పటివరకు సాయం అందలేదు. అధికారులు సర్వేలకే పరిమితమవుతున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏటా నష్టం..

జిల్లాలో గత రెండు, మూడేళ్లుగా వరదల కారణంగా వందల ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. భారీ వర్షాల సమయంలో మహారాష్ట్ర పరిధిలోని వార్ధా, పెన్‌గంగ నదులపై ఉన్న గోసిఖూ, ఈసకుర చిచాడ ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే జిల్లాలోని కుమురంభీం, వట్టివాగు ప్రాజెక్టుల నుంచి కూడా నీటిని దిగువ ప్రాంతాలకు వదులుతారు. ఒక్కసారిగా పెద్దవాగు, ప్రాణహిత నదుల్లో ప్రవాహం పెరిగి పరీవాహక ప్రాంతాలైన దహెగాం, బెజ్జూర్, కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, సిర్పూర్(టి) మండలాల్లో పంటలు నీట మునుగుతున్నాయి. గతేడాది సైతం భారీ వర్షాల కారణంగా ప్రాణహిత, పెన్‌గంగ, పెద్దవాగు వరదలు రైతులను నట్టేట ముంచాయి. జిల్లాలో వేల ఎకరాల్లో పంటలు నష్టపోయారు. వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేపట్టి నష్టం అంచనా వేశారు. కానీ రైతులకు నేటికీ పరిహారం అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నారు. ఈ ఏడాది 25వేల ఎకరాల్లో పత్తిపంట నీట మునగగా, గతేడాది 42వేల ఎకరాల్లో ముంపునకు గురైనట్లు అధికారులు సర్వే ద్వారా గుర్తించారు.

పరిహారం చెల్లింపులో జాప్యం..

ముంపు బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం వ్యవసాయశాఖ అధికారుల ద్వారా సర్వే చేయించినప్పటికీ నయా పైసా కూడా బాధితులకు అందని పరిస్థితి. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న రైతుల పంట పొలాల సర్వే చేపట్టినప్పటికీ పరిహారం చెల్లింపు విషయంలో జాప్యం జరుగుతోంది. రైతులు సాయం ఎప్పుడు అందుతుందోనని దిగాలు చెందుతున్నారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం త్వరలోనే నష్టపరిహారం అందజేస్తోందని పలువురు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పంట నష్టం వివరాలిలా..

గత వర్షాకాలంలో కాగజ్‌నగర్ మండలంలో 2,800 ఎకరాల్లో పత్తి, 350 ఎకరాల్లో కంది పంట నీట మునిగాయి. సిర్పూర్(యూ)లో 200 ఎకరాల్లో పత్తి, ఆసిఫాబాద్‌లో 4వేల ఎకరాల్లో పత్తి, వెయ్యి ఎకరాల్లో కంది, బెజ్జూర్ మండలంలో 6,500 ఎకరాల్లో పత్తి, 120 ఎకరాల్లో కంది, తిర్యాణిలో 2వేల ఎకరాల్లో పత్తి, 200 ఎకరాల్లో కంది, రెబ్బెనలో 3వేల ఎకరాల్లో పత్తి, 200 ఎకరాల్లో కంది, వాంకిడిలో 4,500 ఎకరాల్లో పత్తి, పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి, దహెగాం, కౌటాల, సిర్పూర్(టి), జైనూర్, కెరమెరి, లింగాపూర్‌లో 5,600, 3,40, 3,300, 3,500, 2,000, 800, 800, 200 ఎకరాల్లో పత్తి దెబ్బతింది. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

సర్వేతోనే సరిపెడుతున్నారు



రెండు, మూడేళ్లుగా భారీ వర్షాలతో పంటలు నీట మునుగుతున్నాయి. గతేడాది సైతం ఇదే పరిస్థితి. నది పరీవాహక ప్రాంతాల్లో పంటలు సాగు చేస్తున్న రైతులు ఏటా నష్టాలే చవిచూస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు కేవలం పంట నష్టం సర్వేకే పరిమితమవుతున్నారు.

– పానెం రాములు, తలాయి

పరిహారం అందించాలి



గతేడాది ఏడెకరాల్లో పత్తి పంట వేశాను. ప్రాణహిత ఉప్పొంగడంతో పంట మొత్తం నీటిపాలైంది. దీనికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు పంట నష్టపరిహారం అందించలేదు. వెంటనే పరిహారం అందించి ఆదుకోవాలి.

– నైతం బాపు, రైతు

క్లుప్తంగా

'బలగం' రైటర్ రమేశ్‌కు సన్మానం



రమేశ్‌ను సన్మానించిన కరస్పాండెంట్

మందమర్రిరూరల్: బలగం సినిమా కథ రచయిత రమేశ్‌ను మందమర్రిలోని మాంటిస్సోరి పాఠశాల కరస్పాండెంట్ పోలు శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం సుజాత అభినందించారు. ఆదివారం ఆ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రమేశ్ తమ పాఠశాలలో చదువుకున్నాడని చెప్పడం గొప్పవిషయమన్నారు. చిన్నప్పటి నుంచే రమేష్‌కు సినిమాలపై మక్కువ ఎక్కువగా ఉండేదని, సినీ ఫీల్డ్‌కి వెళితే రాణించలేవని చెప్పేవాడినని గుర్తు చేశారు. ఈ రోజు ×బలగం₹ సినిమాకి రైటర్‌గా రాణించి తెలంగాణ ప్రజల మన్ననలు పొందడం గర్వించతగిన విషయమన్నారు. భగత్‌సింగ్ యూత్, విశ్వబ్రాహ్మణ సంఘం, పలువురు స్వచ్ఛంద సంస్థల వారు, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ రమేశ్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు.

నవజాత శిశువుకు అరుదైన ఆపరేషన్



ఆపరేషన్ అనంతరం శిశువుతో దంపతులు, వైద్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నవజాత శిశువుకు విజయవంతంగా ఆపరేషన్ చేసి వైద్యులు ప్రాణం పోశారు. కోటపల్లి మండలం నాగంపేట గ్రామానికి చెందిన పద్మ–సురేశ్ దంపతులు. మొదటి కాన్పుకు మంచిర్యాలలోని మ్యాక్స్ కేర్ ఆస్పత్రికి వచ్చారు. పద్మకు స్కాన్ చేయగా గర్భంలోని శిశువు కడుపులో 10 సెంటిమీటర్ల ఓవెరియన్ సిస్ట్ ఉందని గుర్తించారు. పద్మకు వారం క్రితం ఆస్పత్రిలో సుఖ ప్రసవం అనంతరం పాప జన్మించింది. ఆ శిశువుకు వైద్యులు లక్ష్మి, నాగరాజు, సాయికృష్ణ, సతీశ్‌ల ఆధ్వర్యంలో శనివారం రెండు గంటల పాటు శ్రమించి విజయవంతంగా కడుపులోని సిస్ట్‌ను తొలగించారు. మహానగరాల్లో నిర్వహించాల్సిన ఆపరేషన్ స్థానికంగా చేయడంతో తల్లిదండ్రులు పద్మ–సురేశ్‌లు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం వారిని ఇంటికి పంపించారు.

టిప్పర్ బోల్తా

నేరడిగొండ: మండలంలోని కుంటాల(కె) గ్రామం వద్ద ఆదివారం టిప్పర్ బోల్తా పడడంతో ప్రమాదం తప్పింది. నిర్మల్ నుంచి కంకర లోడ్‌తో వెంకటాపూర్ గ్రామానికి వెళ్తుండగా కుంటాల ఘాట్స్ వద్ద బ్రేక్ ఫెయిల్ అయి జనావాసాలు ఉండే ప్రాంతంలో బోల్తా పడింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

కూచిపూడిలో సంధ్యకు నంది అవార్డు

నిర్మల్‌టౌన్: శిఖరం ఆర్ట్స్ థియేటర్ గానసభ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం ఉగాది పురస్కారం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కూచిపూడి నాట్యంలో నిర్మల్‌కు చెందిన చిన్నారి పులి సంధ్యకు నంది అవార్డు అందుకుంది. సంధ్యకు నంది అవార్డు రావడం ఆనందంగా ఉందని తండ్రి వెంకటస్వామి అన్నారు.



నమాజ్ చేద్దాం రండి..!

కెరమెరి(ఆసిఫాబాద్): ఇస్లాం సంప్రదాయంలో అత్యంత ముఖ్య భూమికను అజాన్ పోషిస్తుంది. అజాన్ అంటే నమాజ్ చేద్దాం రండి అని పిలవడం. రోజుకు ఐదుసార్లు మసీద్‌ల నుంచి మైక్‌ల్లో ఈ పిలుపు వినపడగానే ముస్లింలు నమాజ్‌కు సన్నద్ధమవుతారు. అప్పటి వరకు చేస్తున్న పనులను పక్కనపెట్టి పవిత్ర హృదయాలతో మసీదుకు బయలుదేరుతారు. రోజు ఐదుసార్లు మసీదు నుంచి వెలువడే వాణినే అజాన్ అంటారని ముస్లిం పెద్దలు చెబుతున్నారు. అజాన్‌పై ప్రత్యేక కథనం!

- అజాన్‌కు ఘన చరిత్ర
- ప్రవక్త మెచ్చిన పిలుపు
- మసీదు నుంచి వెలువడే దివ్యవాణి
- రంజాన్ మాసం ప్రత్యేకం

అజాన్ ఇలా మొదలైంది..

మహ్మద్ ప్రవక్త, ఆయన అనుచరులు మక్కాలో ఉన్నంత కాలం తాము ఉంటున్న ఇంటిలోనే నమాజ్ చేసేవారు. అల్లా ఆజ్ఞ ప్రకారం మహ్మద్ ప్రవక్త మక్కా నుంచి మదీనాకు వలసవెళ్లారు. మదీనా చేరిన వెంటనే అక్కడ నమాజ్ చేయడానికి వీలుగా మసీదు నిర్మాణం చేపట్టారు. అయితే ముస్లింలను ఎలా ఆహ్వానించాలనే ప్రశ్న తలెత్తింది. శంఖం ఊదితే బాగుంటుందని కొందరు.. కాగడా వెలిగిద్దామని మరికొందరు తమ అభిప్రాయాలు వెల్లడించారు. అందులో అబ్దుల్లాబీన్ జైద్ వచ్చి ×నేను ఒక కల గన్నాను. నమాజ్ కోసం అందరిని పిలుస్తున్నా..₹ అని అజాన్ గురించి వివరించారు. ×అల్లాహు అక్బర్.. అల్లాహు అక్బర్.. లాహి లాహి ఇల్లల్లాహి₹ అని ఆయన లయబద్ధంగా



ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు

పాడి వినిపించారు. ఈ పదాలు ప్రవక్తకు నచ్చడం, అంతలోనే దైవవాణి (వహీ) కూడా అవతరించడంతో అబ్దుల్లాబిన్ జైద్‌కు వచ్చిన స్వప్నం నిజమని ప్రవక్త ధ్రువీకరించారు. మహ్మద్ ప్రవక్త జైద్ ను పిలిచి అజాన్ పలుకులను హజ్రత్ బిలాల్ (రజీ) కు నేర్పించాలని సూచించారు. అలా మొదటి సారి అజాన్ హజ్రత్ బిలాల్ పలికారు. ఈ పిలుపు వినగానే ముస్లింలు నమాజ్ చేయాలనే ఉద్దేశంతో మసీదుకు తరలివచ్చారు.

నమాజ్‌కు రావాలనే భావన ఉంది.

అజాన్‌లో అల్లా గొప్పతనం, నమాజ్ ప్రాముఖ్యత ప్రధానంగా ఉంటుంది. దైవవాణి వినిపిస్తుంది. అందరూ నమాజ్ కోసం రావాలనే భావనను అజాన్ చెబుతుంది. రోజుకు ఐదుసార్లు అజాన్ ఉంటుంది. సూర్యోదయానికి ముందు చేసేదాన్ని ఫజర్ అని, మధ్యాహ్నం ఇచ్చే పిలుపును జోహర్ అని పిలుస్తారు. సాయంత్రం అసర్, సూర్యాస్తమయంలో మగరీబ్, రాత్రికి ఇచ్చే పిలుపును ఇషా అని వ్యవహరిస్తున్నారు. నమాజ్ కు ముందు అజాన్ ఇవ్వడం తప్పనిసరి. రంజాన్, బక్రీద్ పండుగలకు అజాన్‌లోని ముందు చరణాలను పలుకుతూ ముస్లింలు నమాజ్‌కు వెళ్తారు.

నమాజ్‌కు ప్రాధాన్యం..

నేరడిగొండ: రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు ఉండడమే కాకుండా నమాజ్ చదువుతారు. అల్లాహ్ దీవెనల కోసం ఐదుసార్లు నమాజ్‌తో పాటు తరావీ నమాజ్ (ఖురాన్ పఠనం) చేస్తారు. నమాజ్‌లో అల్లాహ్‌ను ప్రార్థించడమే కాదు.. సంపూర్ణ ఆరోగ్యం, క్రమ శిక్షణ కూడా అలవడుతుందని వారి నమ్మకం. నమాజ్ వెనుక దాగిన అసలు పరమార్థం ఇదేనని వారి విశ్వాసం. ముస్లింలు చేసే నమాజ్‌లో తక్బీర్, ఖియాం, రుకూ, సజ్దా, సలాం అనే క్రియలు ఉంటాయి. వాటితో ఎన్నో ఉపయోగాలున్నాయి.

వావ్ అనిపించేలా..



పెన్నుతో గీసిన చిత్రాలు



వాటర్ పెయింట్‌తో గీసిన చిత్రం

- చిత్ర లేఖనంలో రాణిస్తున్న ఉపాధ్యాయుడు
- విద్యార్థులకు సైతం శిక్షణ
- జాతీయ స్థాయిలో అవార్డు



కలర్ పెన్సిల్స్‌తో గీసిన చిత్రం..



అవార్డు అందుకుంటున్న వెంకటేశ్‌చారి

దండేపల్లి: అతడు గీసిన చిత్రాలు చిత్తం చెదిరిపోయేలా ఉంటాయి.. పెన్ను, పెన్సిల్, కలర్‌పెన్సిల్స్, వాటర్ కలర్స్, అక్రాలిక్ కలర్స్, క్యాన్వస్ పెయింటింగ్, డిజిటల్ చిత్రాలు గీయడంలో అత్యంత ప్రతిభకనబరుస్తున్నాడు దండేపల్లి మండలం రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆర్ట్ ఉపాధ్యాయుడు శ్రీరాముల వెంకటేష్‌చారి. చిన్నతనం నుంచే అతడికి బొమ్మలు గీయడం అంటే అమితాసక్తి.. దీంతో అతడి ఆసక్తిని ఆచరణలో పెట్టాడు. కాంట్రాక్టు పద్ధతిన ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే విద్యార్థులను చిత్రలేఖనంలో తీర్చిదిద్దడంతో పాటు, తాను కూడా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ డ్రాయింగ్ పోటీల్లో పాల్గొంటూ తన ప్రతిభ చాటుతున్నాడు. ఖాళీ సమయాల్లో రకరకాల పెయింటింగ్ వేయడంతో పాటు పాఠశాలకు వేసవి సెలవుల సమయంలో సినిమాల వైపు దృష్టి మరల్చి సినిమాల్లో బ్యాక్‌గ్రౌండ్ ఆర్ట్ సెట్టింగ్‌లకు పనిచేశాడు.

జాతీయ స్థాయిలో అవార్డు..

అంతర్జాతీయ ఆర్టిస్టు శ్రీశేషబ్రహ్మం ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన కళాయజ్ఞం జాతీయ పోటీల్లో వెంకటేష్‌చారి పాల్గొని అతడు గీసిన చిత్రానికి జాతీయ స్థాయి అవార్డు వచ్చింది. అమరవీరుల స్మారక స్థూపం రూపశిల్పి, ఎం.వీ రమణారెడ్డి ఈ పురస్కారాన్ని అందజేశాడు.

మంచి చిత్రకారుడిగా ఎదగాలని..



చిన్నతనం నుంచే బొమ్మలు గీయడం అంటే చాలా ఇష్టం. దీంతో చదువుతూ, ఖాళీ సమయాల్లో రకరకాల బొమ్మలు గీసేది. దీనికి ఆసక్తితో పాటు ఏకాగ్రత చాలా అవసరం. బీఎడ్‌తో పాటు, ఆర్ట్ విభాగంలో డిప్లమా చేశాను. కాంట్రాక్టు పద్ధతిన ఆర్ట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పోటీల్లో పాల్గొంటున్నాను. నేను గీసిన చిత్రానికి జాతీయ స్థాయి అవార్డు రావడం చాలా ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో మరిన్ని పోటీల్లో పాల్గొని మరిన్ని అవార్డులు సాధించి మంచి చిత్రకారుడిగా పేరుసాధిస్తా.

– శ్రీరాముల వెంకటేశ్‌చారి, ఆర్ట్ ఉపాధ్యాయుడు

ఎక్సైజోళ్లకే పైసలిస్తున్నం... నువ్వేంజేస్తవ్

- రెచ్చిపోతున్న గుడుంబా విక్రయదారులు



దాడిలో గాయపడిన శివరాం

వేమనపల్లి: ఎక్సైజోళ్లకు వచ్చినప్పుడల్లా డబ్బులు ఇస్తున్నాం. మీరేమిజేస్తరు మమ్మల్ని అంటూ గ్రామాల్లో గుడుంబా విక్రయదారులు రెచ్చిపోతున్నారు. కొత్తపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలోని గుడుంబా అమ్మవద్దని అన్నందుకే విక్రయదారులు తనపై దాడి చేశారని గ్రామానికి చెందిన దుర్గం శివరాం విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది నుంచి గ్రామంలో వాడవాడకు గుడుంబా విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, యువత నాటుసారా తాగి పిచ్చిగా ప్రవర్తిస్తున్నారని బాధితుడు తెలిపారు. గుడుంబా అమ్మకాలు అరికట్టాలని ఎక్సైజ్ సీఐ, ఎస్సైకి సమాచారం ఇస్తే పట్టించుకోవడం లేదని వాపోయారు. మంచిర్యాల కార్యాలయానికి వచ్చి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని చెబుతున్నారని వాపోయాడు. నెలనెలా గుడుంబా విక్రయదారుల వద్దకు వచ్చి మామూళ్లు తీసుకుంటూ గుడుంబా అమ్మకాలకు ఊతం ఇస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో గుడుంబా తయారీ, అమ్మకాలను అరికట్టాలని కోరారు.

'గిరి' గ్రామాల్లో ఒలింపియాడ్ స్కూళ్లు

- సైన్స్ ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మంజూరు
- వచ్చే సంవత్సరం ప్రారంభం
- పాఠశాలల్లో ప్రవేశాలకు పరీక్ష నేడు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఉమ్మడి జిల్లాలో పరీక్ష రాసేవారు..

జిల్లా	ఆశ్రమపాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
ఆదిలాబాద్	51	2040
ఆసిఫాబాద్	46	1840
మంచిర్యాల	16	640
నిర్మల్	17	680



ప్రశ్నపత్రాలతో సిబ్బంది

ఉట్నూర్: ఐటీడీఏ గిరిజన సంక్షేమశాఖ ఆధీనంలో ఉమ్మడి జిల్లాలో ఎనిమిది సైన్స్ ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలలు వచ్చే విద్యాసంవత్సరంలో ప్రారంభం కానున్నాయి. బాల,బాలికలకు వేర్వేరుగా ప్రతి జిల్లాకు రెండు ఆశ్రమ పాఠశాలల చొప్పున 8 మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న 4, 5, 6, 7, తరగతుల్లో ఒక్కో తరగతికి 40 మంది చొప్పున విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సోమవారం నిర్వహించే ప్రవేశపరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

ప్రతిపాదనలు సిద్ధం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 132 ఆశ్రమ పాఠశాలలున్నాయి. వీటిల్లో దాదాపు 36 వేలకు పైగా గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో సైన్స్ ఒలంపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. జిల్లాలో ఏయో ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థుల ప్రవేశాలకు ఇబ్బంది లేకుండా ఎంపిక కోసం గిరిజన సంక్షేమ శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది.

ప్రత్యేక బోధన..

ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలల్లో ఎంపికైన గిరిజన విద్యార్థులకు ప్రత్యేక విద్యాబోధన అందించనున్నారు. గణితం, సైన్స్, ఇంగ్లిష్ ప్రాధాన్యత గుర్తించి ప్రభుత్వం ఆయా అంశాల్లో వారిని తీర్చిదిద్దనుంది. ప్రస్తుతం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 4, 5, 6, 7 తరగతి చదువుతున్న విద్యార్థులకు సైన్స్ ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రవేశపరీక్ష ఉంటుంది. మొత్తం 5,200 మంది పరీక్షకు హాజరుకానున్నారు.

ఏర్పాట్లు పూర్తి



ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేశాం. 5200 మంది గిరిజన విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పకడ్బందీగా పరీక్ష నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి.

– జగన్, ఏసీఎమ్‌వో, ఐటీడీఏ ఉట్నూర్

టేకు చెట్లు నరికిన ఇద్దరి రిమాండ్

పెంబి: టేకు చెట్లు నరికి అక్రమంగా తరలిస్తుండగా ఇద్దరి నిందితులను పట్టుకుని రిమాండ్ తరలించినట్లు ఎఫ్ఆర్‌వో రామకృష్ణ, డీఆర్‌వో ప్రతాప్ నాయక్ తెలిపారు. ఆరుగురు పరారయ్యారు. వారి కథనం ప్రకారం..పెంబి రేంజ్ పరిధిలోని దోందారి బీట్‌లో ఉట్నూర్ మండలం చిన్న గంగాపూర్‌లో 8 మంది నిందితులు 12 టేకుచెట్లు నరికిన దుంగలను ఉట్నూర్‌కు తరలిస్తున్నారని సమాచారం అందింది. తనిఖీ చేయగా ఆరుగురు పరారయ్యారు. ఇద్దరు నిందితులు టేకం దేవురావ్, ఆరే కన్నయ్యను పట్టుకుని ఆదివారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా..14 రోజులు రిమాండ్ నిమిత్తం నిర్మల్ సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

'అతిథులకు' జీతాల్లేవ్



విద్యార్థులకు పాఠం బోధిస్తున్న గెస్ట్ లెక్చరర్

- ఆరునెలలుగా అందక ఇబ్బందులు
- కుటుంబ పోషణ భారం
- ఉమ్మడి జిల్లాలో 186 మంది గెస్ట్ లెక్చరర్లు

వివరాలు

జిల్లాలు	గెస్ట్ లెక్చరర్లు
నిర్మల్:	39
ఆదిలాబాద్:	53
కుమురంభీం	40
మంచిర్యాల:	54
మొత్తం:	186

లక్ష్మణచాంద: ప్రభుత్వ కళాశాలలు ఉత్తమ ఫలితాలు వస్తున్నాయంటే అందులో అతిథి అధ్యాపకుల పాత్ర వెలకట్టలేనిది. రెగ్యులర్ లెక్చరర్ల మాదిరిగానే విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ వారి ఉన్నతికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గెస్ట్ లెక్చరర్లకు ఆరునెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారింది. దీనికి తోడు కాంట్రాక్టు అధ్యాపకుల బదిలీ ప్రక్రియ కొనసాగుతుండటంతో మూలిగే నక్కమీద తాటికాయ పడ్డచందంగా తయారైంది. 2013 నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారు. గంటకు ప్రభుత్వం రూ.390 చెల్లిస్తోంది. వీరికి నెలకు గరిష్టంగా రూ.28,080 ఇస్తోంది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో 186 మంది గెస్ట్ లెక్చరర్లు ఉన్నారు. ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ సంబంధించి వేతనాలు విడుదల చేసింది. జూన్, నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల వేతనాలు రావల్సి ఉన్నాయి. సకాలంలో వేతనాలు అందక వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల బదిలీ వల్ల నిర్మల్ జిల్లాలో ఇప్పటికే 6 గెస్ట్ లెక్చరర్లు ఉద్యోగాలు కోల్పోయారు. వచ్చే విద్యా సంవత్సరంలో జిల్లాలో ఖాళీ ఉన్నచోట గతంలో పనిచేసిన గెస్ట్ అధ్యాపకులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలని గెస్ట్ లెక్చరర్లు కోరుతున్నారు.

వేతనాలు విడుదల చేయాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఆరునెలల నుంచి వేతనాలు రాలేదు. కుటుంబాలకు ఇబ్బందులు ఎదురువుతున్నాయి. ప్రభుత్వం వెంటనే వేతనాలు విడుదల చేయాలి. – జి. సాయినాథ్, గెస్ట్ లెక్చరర్ల సంఘం, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు

కుటుంబ పోషణ భారం



నిర్మల్ జిల్లా ముధోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పని చేస్తున్నా. ఈ విద్యాసంవత్సరంలో జూన్, నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల వేతనాలు రాలేదు. కుటుంబ పోషణ భారంగా ఉంది. అధికారులు త్వరగా వేతనాలు ఇప్పించాలి.

– ముత్యం, గెస్ట్ లెక్చరర్

సమస్య పరిష్కరిస్తాం



గతంలో జిల్లాలోని గెస్టు లెక్చరర్ల వేతనాలు డీఐఈవో కార్యాలయం నుంచి పంపేవారు. కాని ఇప్పుడు వారు పనిచేసే కళాశాలల ప్రిన్సిపాళ్ల నుంచి ఇస్తారు. రెండు రోజుల్లో వారితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం.

– పరశురామ్, ఇంటర్ నోడల్ అధికారి

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

బెల్లంపల్లిరూరల్: కుటుంబ కలహాలతో వివాహిత ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని బుచ్చయ్యపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. తాళ్ల గురిజాల ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం... బుచ్చయ్యపల్లి గ్రామానికి చెందిన పందుల శేఖర్‌తో బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి రడగంబాల బస్తీకి చెందిన ముక్కెర లక్ష్మి అనే మహిళతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇటీవల శేఖర్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరుచుగా భార్యాభర్తలకు గొడవ జరుగుతుండేది. నిత్యం తాగివచ్చి భార్యతో గొడవ పడేవాడు. కొన్ని రోజుల క్రితం శేఖర్ హనుమాన్ మాల ధరించి శుక్రవారం విరమణ చేసిన మరుసటి రోజే మద్యంతాగి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. మత్తులో ఇంట్లోని టీవీ, సెల్‌ఫోన్ ధ్వంసం చేశాడు.

భరించే ఓపిక లేక ..

శేఖర్‌లో మార్పు రాక పోవడంతో పాటు మళ్లీ యథావిధిగా తాగడం మొదలుపెట్టడంతో లక్ష్మి తీవ్రమైన మానసిక వేదనకు గురైంది. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. తీవ్రగాయాలైన లక్ష్మిని అదే రాత్రి బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతిచెందింది. ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. మృతురాలి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తేనెటీగల దాడిలో ముగ్గురికి గాయాలు

సిర్పూర్(టి): మండలంలోని కంచరపేట గ్రామంలో ఆదివారం తేనె టీగల దాడిలో ముగ్గురు గాయాలపాలయ్యారు. పోచమ్మ ఆలయానికి అమ్మవారి దర్శనం కోసం వెళ్లగా తేనె టీగలు దాడి చేయడంతో కొండబోని రమ పరుగెత్తడంతో కిందపడి కాలు విరిగింది. తిరుపతి, భీమయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

జాతీయ రహదారి విస్తరణలో పక్షపాతం

- జాతీయ రహదారి 63 మంది బాధితులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నూతనంగా నిర్మాణం చేపట్టనున్న మంచిర్యాల – అర్మూర్ జాతీయ రహదారి 63ప్రణాళిక తయారీలో పూర్తి పక్షపాతం ఉందని జాతీయ రహదారి బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం హాజీపూర్ మండల జాతీయ రహదారి 63 బాధితులు కలిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా నిర్మించనున్న జాతీయ రహదారి ప్రణాళికలో చాలా లోపాలున్నాయన్నారు. గతంలో వచ్చిన రోడ్డు ప్లాన్‌ను రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున ముడుపులు అందుకుని మార్చినట్లు తెలుస్తోందని అన్నారు. రోడ్డుకు ఒకవైపు నుంచి మాత్రమే వెడల్పు చేయడంతో రోడ్డు పక్కన ఇండ్లు పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఈ క్రమంలో రోడ్డుకు ఇరువైపులా భూ సేకరణ చేపట్టాలని కోరారు. ఇప్పటికే ఎల్లంపల్లిలో ఇండ్లు కోల్పోయి రోడ్డు వైపు వచ్చి ఇండ్లు కట్టుకుని ప్రశాంతంగా ఉన్న తమకు ఈ రోడ్డు వెడల్పులో మరోసారి ఇళ్లు కోల్పోతే తమను ఆదుకునేవారు ఎవరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు, భూపరిహారం ఎంతో తేల్చిన తర్వాతే భూ సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పుడున్న మార్కెట్ విలువ ప్రకారమే పరిహారమే చెల్లించాలని, ఉపాధి కోల్పోతున్న వారికి ఉపాధి కలిపించాలని డిమాండ్ చేశారు. బాధితుల



మాట్లాడుతున్న జాతీయ రహదారి బాధితులు

కలిసి మండల జాతీయ రహదారి 63 బాధితుల సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందుల రమేష్, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు మల్లేశ్‌లను ఎంపిక చేస్తూ బాధితుల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఇందులో ఒడ్డె బాలరాజు, బేర పోచయ్య, లగిశెట్టి రాజయ్య, దొమ్మటి సత్తయ్య, మల్కు నగేశ్, రాజేశ్, వెంకటేశ్వర్లు, చంద్రయ్య, వెంకటేశ్, చారి ఉన్నారు